క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ క్లబ్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బారికేడ్స్ అందజేత



పోలీసులకు అందజేస్తున్న రమణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ పిలుపుని చ్చారు. తెల్లాపూర్ రేడియల్ రోడ్లపై ప్రమాదాల నివారణకు స్టార్ ఆసుపత్రి యాజమాన్యం ఆదివారం 15బారికేడ్స్‌ను అందజేసింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు స్టార్ ఆసుపత్రి యాజమాన్యాన్ని కోరడంతో వారు వెంటనే స్పందించడం సంతోషంగా ఉందన్నారు. వాటిని ట్రాఫిక్ పోలీసులకు అందజేశామని చెప్పారు.

'నీట్'ను రద్దుచేయాలి


నిరసనలో పాల్గొన్న సంతోష్ తదితరులు

సంగారెడ్డి: నీట్‌ను తిరిగి నిర్వహించాలని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు కూన సంతోష్ పాల్గొన్నారు. సంగారెడ్డి నుంచి తన అనుచరులతో కలిసి పాల్గొనడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

బీసీ యువత అధ్యక్షుడిగా దత్తు


నియామక పత్రం అందజేస్తున్న కృష్ణయ్య

నారాయణఖేడ్: నియోజకవర్గ బీసీ యువత అధ్యక్షుడుగా గంగాపూర్‌కు చెందిన దత్తు కురుమను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల ఐక్యతకు కృషి చేయాలన్నారు. దత్తును సంఘం రాష్ట్ర నాయకుడు వంశీకృష్ణ, నరేశ్ యాదవ్, సిందోల్ దశరథ్ తదితరులు అభినందించారు.

తాగునీటికి గిరిజనుల పాట్లు


నీళ్లు పట్టుకుంటున్న తండావాసులు

నారాయణఖేడ్: మండలంలోని మాద్వార్ తండాలో కొన్ని నెలల నుంచి తాగునీటి సరఫరా జరగడం లేదు. దీంతో వారంతా తండా శివార్లలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. వర్షాలు కురవడంతో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉందని తండావాసులు వాపోతున్నారు. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని, తమకు తాగునీటిని అందజేయాలని గిరిజనులు కోరుతున్నారు.

'ఆరుతడి'పై ఆసక్తి


మర్వెల్లి గ్రామంలో ఆరుతడి పంట సాగు

- పత్తిపై రాని పెట్టుబడి
- పెసర, మినుము పంటలపై మొగ్గు
- ఖర్చులు తక్కువ అంటున్న రైతులు

జోగిపేట(అందోల్): పత్తి పంటలో సరైన దిగుబడి సాధించకపోగా పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. కూలీలు, ఇతర పనులకు పెద్ద మొత్తంలో ఖర్చులు అవుతున్నాయి. దీంతో రైతులు ఆరుతడి పంటలవైపే మొగ్గు చూపుతున్నారు. పత్తి పంటకు ఎకరాకు సుమారు లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే విత్తనాలు నాటేందుకు, కలుపు తీసేందుకు, ఇతర ఖర్చులకు సుమారుగా రూ.60 వేల నుంచి రూ.70వేల వరకు ఖర్చుకావడంతో రైతులు ఆరుతడి పంటలు పండిస్తున్నారు.

ఖర్చులు తక్కువ

సోయాబీన్, పెసర, మినుము పంటలకు విత్తనాలు నాటిన నెలకు గడ్డిమందు కొట్టినట్లయితే మరో రెండు నెలల వరకు కలుపుతీసే అవసరం ఉండదు. అదే పత్తి పంటకైతే నాలుగుసార్లు కలుపు తీయించాల్సి ఉంటుంది. ఒక్కొక్కసారి కలుపు తీయాలంటే కూలీలకు రూ.10వేల చొప్పున వెచ్చించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో ఎకరాలో పత్తి సాగుచేస్తే 10నుంచి 12క్వింటాళ్ల పంట చేతికొచ్చేది. ప్రస్తుతం 5, 6క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుంది. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదనే ఆందోళనలో రైతులు ఉన్నారు. అందుకే ఈ సంవత్సరం రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. వట్‌పల్లిలో 24,500 ఎకరాల భూములు ఉండగా, 22వేల ఎకరాల్లో పత్తి, 1200 ఎకరాల్లో వరి, 350 ఎకరాల్లో కందులు, 215 ఎకరాల్లో పెసర, 90 ఎకరాల్లో మినుములు, 300 ఎకరాల్లో కూరగాయల పంటలు పండిస్తున్నారు.

కోతులు, అడవి పందుల బెడద


మంజీరా పరివాహక ప్రాంతాలైన అందోలు, పుల్కల్, చౌటకూరు, హత్నూర మండలాల్లో కోతులు, అడవి పందుల బెడదతో ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించలేకపోతున్నారు. ఈ మూడు మండలాల్లో సుమారుగా లక్షకు పైగా ఎకరాల్లో వ్యవసాయ భూమి ఉంది. అందులో సుమారు 60వేల వరకు వరి, 40వేల వరకు పత్తి, వెయ్యి ఎకరాల్లో జొన్న, ఇతర పంటలు పండిస్తున్నారు. ఇక్కడ కోతులు, అడవి పందుల బెడద ఎక్కువగా ఉండడంతో రైతులు ఆరుతడి పంటలవైపు ఆసక్తి చూపడంలేదు. వరికి ప్రభుత్వం కనీస మద్దతుధర చెల్లించడం వల్ల ఎక్కువ శాతం రైతులు వరి వైపే ఆసక్తి చూపుతున్నారు. ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్న విషయంపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు.

– అరుణ, ఏడీఏ, జోగిపేట

21 ఎకరాల్లో పండిస్తున్నా...


నాకు మొత్తం 30ఎకరాల వరకు వ్యవసాయ భూమి ఉంది. ప్రస్తుతం 21ఎకరాలలో ఆరుతడి పంటలు పండిస్తున్నాను. 20ఏళ్లుగా పత్తినే పండిస్తున్నాను. పెట్టుబడి రాకపోగా ఖర్చులు ఎక్కువై దిగుబడి తక్కువగా వస్తోంది. పత్తికి ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుండగా రూ.70వేల వరకు వివిధ పనులకు ఖర్చు చేయాల్సి వస్తుంది. అందుకే 15ఎకరాల్లో సోయాబీన్, మూడు ఎకరాల్లో పెసర, మరో మూడు ఎకరాల్లో మినుములను పండిస్తున్నాను. ఈ పంటలకు ఖర్చు తక్కువ, దిగుబడి కూడా సంతప్తికరంగానే ఉంది.

– గాండ్ల వీరేందర్, రైతు, మర్వెల్లి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

కార్మికులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం బెల్ టౌన్‌షిప్‌లోని పెన్నార్ పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి పూజా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు, యాజమాన్యం మధ్య మంచి సంబంధాలున్నప్పుడే పరిశ్రమ అభివృద్ధి పథంలో సాగుతుందన్నారు. కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. అనంతరం కార్మికులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీజీ ఎంపీపీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు జేఏసీ ఎన్నిక

జిన్నారం(పటాన్‌చెరు): కాలుష్య నివారణ కోసం న్యాయ పోరాటం చేస్తామని, తాము చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ప్రముఖ న్యాయవాది, పర్యావరణ వేత్త దండె రమాకాంత్ పిలుపునిచ్చారు. మండలంలోని ఖాజీపల్లి ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతుండడంతో ఆయన ఆధ్వర్యంలో పోరాటం చేపట్టారు. ఆదివారం జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. రమాకాంత్ జేఏసీ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో 24మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. అనంతరం వారితో కాలుష్య నివారణ కోసం కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భార్గవ్, భీమాచ, కుమార్‌యాదవ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న రమాకాంత్ తదితరులు

కార్మికుల సంక్షేమం కోసం కృషి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

జహీరాబాద్ టౌన్: కార్మికుల సంక్షేమ కోసం సీఐటీయూ నిత్యం కృషి చేస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారంలోని టీఎంఎస్, ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు శ్రామిక్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన వేతన ఒప్పందం కోసం సీఐటీయూ పోరాటాలు చేస్తుందన్నారు. త్వరలోనే మహీంద్రలో వేతన ఒప్పందం జరగనుందని, రాబోయే కార్మిక యూనియన్ ఎన్నికల్లో సీఐటీయూను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తదితరులు

చెరువు పరిసరాలు శుభ్రం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మేళ్లచెరువు పరిసరాలను ఆదివారం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్, గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో చెరువు పరిసరాలను శుభ్రం చేయడం హర్షదాయకం అని ప్రశంసించారు. కార్యక్రమంలో చిన్నారులు సైతం పాల్గొనడం విశేషం అన్నారు.

ముఖర్జీ సేవలు మరువలేనివి

జిన్నారం(పటాన్‌చెరు): భారతీయ జనసంగ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ హిందువుల కోసం ఎంతో కృషి చేశారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ప్రశంసించారు. శనివారం ముఖర్జీ వర్ధంతి సందర్భంగా జిన్నారంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి హిందూవాద పార్టీని స్థాపించిన నేత ముఖర్జీ అన్నారు. కార్యక్రమంలో పార్టీమండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్‌లో..

అఖండ భారతావని కోసం ప్రాణాలర్పించిన జన్ సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రకాశ్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ముఖర్జీ గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ జగన్నాథ్, నాయకులు సుధీర్ బండారీ, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, విశ్వనాథ్ స్వామి, సంతోష్, రాఘవేంద్రనాయక్, అప్పం శ్రవణ్, పూల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


జిన్నారంలో వాళులర్పిస్తున్న నాయకులు

హక్కుల సాధనలో కార్మికులకు మద్దతు

కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు: ఓఆర్ఆర్ కార్మికుల హక్కుల సాధన పోరాటంలో తన పూర్తి మద్దతు ఉంటుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. టోల్‌ప్లాజా నూతన కార్మిక సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేసిన సందర్భంగా ఆయనను ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. గౌరవ అధ్యక్షుడుగా సంజీవరెడ్డి, ముఖ్య సలహాదారుగా జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, అధ్యక్షుడుగా నర్సింహారెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాజు, దశరథ్, కిరణ్ మాజీ సర్పంచ్ వెంకన్న, అశోక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


నీలం మధును సత్కరిస్తున్న నాయకులు

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

హత్నూర(సంగారెడ్డి): విద్యుత్ షాక్‌కు గురైన ఓ గేదె మృతి చెందిన ఘటన మండలంలోని లింగాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రైతు నర్సింహులకు సంబంధించిన పశువులు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లాయి. కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్ ఓ గేదెకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

చికిత్స పొందుతూ మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన నారాయణ(38) తన ద్విచక్ర వాహనంపై గత 10న పటాన్‌చెరు వెళ్లి తిరిగి వస్తుండగా పటేల్‌గూడ ఎల్లంకి కళాశాల సమీపంలో బస్సును ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడడంతో అతడిని చందనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


మహేశ్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కుర్షిత్ అలీ కథనం ప్రకారం.. ఆల్విన్ కాలనీకి చెందిన మహేశ్‌గౌడ్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత 13న రామచంద్రపురం పరిధిలోని ఈఎస్ఐ ఆసుపత్రికి వెళ్లొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. కాని తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన భార్య ఆమని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాల కోసం భూలక్ష్మమ్మకు పూజలు

నారాయణఖేడ్: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో గ్రామాలు కళకళలాడాలని మనూరు మండలం ఎల్గోయి, అతిమ్యాల్ గ్రామాలకు చెందిన రైతులు తుర్కపల్లి భూలక్ష్మమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఆయా గ్రామాల నుంచి కలశాలు, తులసి కోటలు నెత్తిన పెట్టుకుని పాదయాత్ర చేశారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే వర్షాలు సక్రమంగా కురవాలని అమ్మవారిని మొక్కుకున్నట్టు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్ ఆలయాన్ని దర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు.


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

రైతుల హర్షం..

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని కుప్పానగర్, మేదపల్లితోపాటు పలు గ్రామాల్లో జోరుగా వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో ఆదివారం కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా పత్తి మొక్కలు వాడిపోతున్న తరుణంలో వర్షాలు కురవడం మొక్కలకు ప్రాణం పోసినట్టయిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

మునిపల్లి(అందోల్)లో..

మండలంలోని మన్‌సాన్‌పల్లి, కంకోల్, బుదేరా, మునిపల్లి, హైద్లాపూర్ గ్రామాలతోపాటు మరి కొన్ని గ్రామాల్లో వర్షం కురిసింది. ఖరీఫ్ పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.


ఝరాసంగం(జహీరాబాద్): కుప్పానగర్‌లో..

మొక్కు చెల్లించుకున్న బీజేపీ కార్యకర్తలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మెదక్ ఎంపీగా రఘునందన్ రావు గెలుపొందిన నేపథ్యంలో ఝరాసంఘం మండలంలోని బసవలింగప్ప స్వామి ఆశ్రమం వరకు పాదయాత్రగా వెళ్లి బీజేపీ కార్యకర్తలు ఆదివారం మొక్కు చెల్లించుకున్నారు. మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామ శక్తి కేంద్రం ఇన్‌చార్జి సుభాశ్‌తోపాటు మరో ఎనిమిది మంది కార్యకర్తలు ఎన్నికల ముందు బసవలింగప్ప స్వామికి మొక్కుకున్నారు. ఆయన అనుగ్రహంతో రఘునందన్ రావు ఎంపీగా గెలవడంతో తాము మొక్కు తీర్చుకున్నామని చెప్పారు. పాదయాత్రను జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, మాణిక్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, శ్రీకాంత్, అంబదాస్, మోహన్‌రెడ్డి, ఆదిత్య, సుభాష్, జగన్నాథ్ రెడ్డి, దుర్గారాజ్, శంకర్, సుధాకర్, ప్రశాంత్, శివలింగం, శ్రీశైలం, నాగరాజు, అనిల్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్రను ప్రారంభిస్తున్న మాణిక్ రావు

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

జెడ్పీటీసీ కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని అన్ని గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధిచేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలతోపాటు మండల కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

వేంకటేశ్వరుడి విగ్రహం లభ్యం

నారాయణఖేడ్: మండలంలోని హన్మంత్‌రావుపేటకు చెందిన అనిశెట్టి రాజు, సంగమేశ్వర్ అనే రైతులు తమ పొలంలో జేసీబీ ద్వారా చదును చేయిస్తుండగా ఆదివారం వేంకటేశ్వర స్వామి పంచలోహ విగ్రహం లభ్యమైంది. విగ్రహం ఒకఫీటు ఎత్తు, రెండు నుంచి రెండున్నర కిలోల బరువుతో ఉందని రైతులు తెలిపారు. విగ్రహాన్ని చూడడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం విగ్రహాన్ని వేంకటేశ్వరుడి ఆలయ ఆవరణలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.


పొలంలో లభించిన విగ్రహం

'అంతర' సాగు.. లాభాలు బాగు

- కూరగాయలు, ఇతర పంటలతో అదనపు ఆదాయం
- డీడీఎస్ కేవీకే శాస్త్రవేత్త శైలజ


మామిడి తోటలో వేసిన అంతర పంట


జి.శైలజ, శాస్త్రవేత్త

జహీరాబాద్: జిల్లాలో మామిడితోటల సాగు విస్తీర్ణం ప్రతిఏటా పెరుగుతోంది. రోజురోజుకూ రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. మామిడి నాటాక చెట్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో అంతర పంటలు సాగు చేసుకున్నట్లయితే అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్త జి.శైలజ పేర్కొన్నారు. అంతర పంటలు వేయడం వల్ల భూమిని, నీటి వనరులను సమర్థంగా వినియోగించుకున్నట్లు అవుతుందని, సాగుపై రైతులు ఆసక్తిచూపి అదనపు ఆదాయాన్ని పొందాలని సూచించారు.

మామిడిలో వేసుకోదగిన పంటలు

మామిడి చెట్ల దూరాన్ని బట్టి ఈ అంతర పంట వేయాల్సి ఉంటుంది. మామిడిని అధిక సాంద్రత పద్ధతిలో వేసుకున్నట్లయితే సుమారుగా ఎకరానికి 200మొక్కలను నాటుతారు. అదే విధంగా మామిడిని అల్ట్రా హైడెన్సిటీ పద్ధతిలో వేసుకున్నట్లయితే ఒక ఎకరానికి 500–550వరకు మొక్కలు నాటుతారు. అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేసిన తోటల్లోనే అంతర పంటలను వేసుకొనే వీలుంటుంది. మొదటి, రెండో సంవత్సరంలో మొక్క వ్యాప్తి ఎక్కువగా ఉండదు. కాబట్టి అంతర పంటల కింద చుక్కకూర, ఔషధ మొక్కలు వేసుకోవచ్చు. అంతే కాకుండా తక్కువకాల వ్యవధిలో వచ్చే దోస, బిక్కుడు, బీర, పంటలను వేసుకోవచ్చు. అలాగే జనుము, జీలుగలతో పాటు నవధాన్యాలు కూడా సాగుచేయవచ్చు. నవధాన్యాల సాగువల్ల మొక్కలు గాలిలో ఉండే నత్రజనిని తీసుకుని భూమిలో నింపుతాయి. దీని వల్ల భూమిలో నత్రజనిశాతం పెరుగుతుంది. అలాగే వంగ, టమాటా, పచ్చిమిర్చి పంటలతోపాటు తీగ జాతి కూరగాయలను కూడా వేసుకోవచ్చు. అలాగే అయిన అల్లం, పసుపు పంటలను సైతం మామిడిలో అంతర పంటలుగా వేసుకోవచ్చు. జామ, నిమ్మ, సపోటాను కూడా మామిడి తోటల్లో సాగుచేయవచ్చు. 25ఏళ్ల దాటిన తోటల్లో కూడా అంతరపంట వేసుకుని ఆదాయం పొందవచ్చు.